చన లేకుండా పనిచేసిన సందర్భాన్ని మరువలేం. ''గోదారి గోదారి ఓహో పారేటి గోదారి / సుట్టూ నీళ్ల ఉన్న సుక్కా దొరకని ఎడారి ఈ భూమి' అంటూ నీళ్ల దోపిడీని అరుణోదయ యశ్‌పాల్ చెప్పుకొన్నడు. అప్పటిదాంక విప్లవోద్యమ నేపథ్యం ఉన్న కవి గాయకులు గూడ అంజయ్య, మిత్ర, దయా నర్సింగ్ వంటి కవులెందరో తెలం'గానం' ఎత్తుకున్నరు.

**ఓరుగల్లుకు పేరు పెట్టినరా?**
**వేయి స్తంభాల గుడి మీరు గట్టినరా?**
**మెదక్ చర్చి మీరు గట్టినరా?**
**మక్కా మసీదు పునాది తీసినరా?**

**పాట:** అయ్యోనివా నీవు అవ్వోనివా
**రచన:** గూడ అంజన్న









విప్లవ పథంలో పయనించిన విమలక్క తెలంగాణ ప్రత్యక్ష ఉద్యమంలోకి తనదైన లక్ష్యంతో అడుగేసింది. ''ఆడుదాం డప్పుల్లా దరువెయ్‌రా/ పల్లె తెలంగాణ పాటబాడరా'' అంటూ మిత్ర రాసిన పాటను భుజానేసుకొని తానే ఓ తెలంగాణ ఉద్యమశక్తిగా అవతరించింది. ఆ తర్వాత కాలంలో గిద్దె రామనర్సయ్య, దరువు ఎల్లన్న, సాయిచంద్ వంటి విప్లవ పథంలోని కవులెందరో తెలంగాణ పాటల బాటపట్టిండ్రు. ''యాడున్నరో వీరులు / ఎర్రెర్ర దారుల్లో''అంటూ విప్లవోద్యమ భావజాలంతో మొదలైన కొమిరె వెంకన్న ''అమ్మా సూడమ్మ బైలెల్లి నాదో గోదారమ్మ / గంగమ్మ తల్లయ్ బైలెల్లినాదో గోదారమ్మ'' అంటూ గోదావరి నదీ జలాల పాటైండు. ''పాటమ్మా నాకు ప్రాణమైతివే పాటమ్మా'' అంటూ తెలంగాణ ఉద్యమంలోకి వచ్చిండు. ''ప్రజల కొరకు పాటుపడే కళాకారులం/ పగలు రాత్రి వెలుగునిచ్చే సూర్యచంద్రులం'' అంటూ విప్లవ బాటలో మొదలై ''ఉన్నాది మా ఊరు పేరుకు/ ఆడ బతుకుదెరువు లేదు పల్లెకూ'' అంటూ దుఃఖగీతమై తెలంగాణ ఉద్యమ దారిలో అడుగుపెట్టిండు.

### నాగేటి సాల్లల్ల నా తెలంగాణ

బందారం రైతుబిడ్డ నందిని సిధారెడ్డి. ''నాగేటి సాల్లల్ల నా తెలంగాణ నా తెలంగాణ / నవ్వేటి బతుకుల నా తెలంగాణ నా తెలంగాణ'' అంటూ తెలంగాణ జీవన సౌందర్యాన్ని, సాంస్కృతిక జీవనాన్ని వర్ణించిన తీరు ఎందరినో కదిలించింది.

తెలంగాణ అస్తిత్వాన్ని చాటే పాటలకు ఈ పాట ఓ ప్రేరణ! ''పచ్చని మా పల్లెటూరు పాడిపంటల సెలయేరు'' ఈ పాట కన్నీరు బెట్టిస్తది. రచయిత ఎవరో కూడా తెలియని ఎన్నో పాటలు ఉద్యమానికి ఊపిరిపోసినయి. గోరటి వెంకన్న పాటకు రేలపూతల సొగసుంటది. రెల్లుగడ్డి ఊగినట్టుంటది. దుందుభి నది ఎగిరి దునికినట్టుంటది. ''సంచారమె ఎంతో బాగున్నది దీనంత ఆనందమేదున్నది'' అనుకున్న గోరటి వెంకన్న తెలంగాణ ఉద్యమమై ప్రవహించిండు. కన్నీరుబెడుతున్న పల్లెని చూసి కుమిలిపోయిండు. చెట్టుకు, పుట్టకు చెప్పుకొని దుఃఖ గీతమైండు. ఎండిన వాగును జూశి ''ఇద్దరం విడిపోతే భూమి బద్దలైతుందా'' అంటూ తెలంగాణ యుద్ధానికి తెరదీసిండు. ''గానమా నా ప్రాణమా తెలంగాణమ జనగానమా'' అంటూ తెలంగాణ అంతా కలెదిరిగిండు. మాదరబోయిన సత్తయ్య రాసిన ''తెలంగాణ తెలంగాణ ఎల్లన్నారో మల్లన్నారో / తెలంగాణకు జరిగే మోసం జూడు ఎల్లన్నారో'' అంటూ తెలంగాణను జాగృతం చేసిండు. గోదావరి గొంతుక మల్లావఝుల సదాశివుడు రాసిన ''తలాపునా పారుతుంది గోదారి నీ చేను నీ చెలకా ఎడారి'' అంటూ నీళ్ల దోపిడి ఎట్ల సాగిందో, తెలంగాణకు ఎంత అన్యాయం జరిగిందో చెప్పుకొచ్చిండు. కరువుకు కారణాలు చూపిచ్చిండు.

### ఎట్లున్నవే నా పల్లే?..

''కొమ్మలల్ల కోయిలమ్మ పాట పాడుతున్నది జై తెలగాణ అన్నది'' అంటూ తెలంగాణ ఉద్యమంలోకి పశుపక్ష్యాదులు సైతం వాలిపోయినయనే సందేశంతో గిద్దె రామనర్సయ్య అద్భుతమైన పదాలు అల్లిండు. ఎన్నో జానపద, సామాజిక పాటలు రాసిన నేర్నాల కిషోర్ తెలంగాణ ఉద్యమం కోసం అలుపు లేకుండా పోరాడిండు. ''పాడిసేటి పొద్దోలె ఎలమంద/ పోరుదారెంట బోతండె ఎలమంద'' అంటూ తెలంగాణ జెండబట్టి పల్లె పల్లె ప్రజాగానమైనడు. ఉద్యమానికి ఊపిరైనడు. కరువులు, వలసలతో అల్లాడిపోతున్న పల్లెను చూసి ''ఎట్లున్నవే నా పల్లే నువ్వు ఎట్లున్నవే నా తల్లీ'' అంటూ తనకు దూరమైన పల్లెతల్లి కోసం దేవులాడిండు. పల్లెలోని ప్రతి గడపను పలకరించిండు. ''ఊరు తెలంగాణ/ నా పేరు తెలంగాణ'' అంటూ అందెశ్రీ తెలంగాణ తిరిగిండు. ''జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం'' అనే జాతి గీతమైండు. కామారెడ్డి ధూంధాం మొదలు రాష్ట్రం సిద్ధించేదాక శబ్దమై సుట్టుకొచ్చిండు. జనజాతరలో తన గీతాన్ని జయకేతనంగా ఎగరేసిండు. ''నా చిట్టిచేతులు చక్కని రాతలు నేర్వలేదయ్యో'' అన్న చింతల యాదగిరి



### గిది తెలంగాణ



**తెలంగాణ జానపద** కళల మాగాణం. యక్షగానం, ఒగ్గుకథ, కోలాటం, బోనాలు, బతుకమ్మ వంటి కళారూపాలతో పాటు శారదకాండ్రు, పిచ్చుకగుంట్లు, బైరూపులు, విప్రవినోదులు, ఫకీర్లు, పెద్దమ్మలోళ్లు, బుడిగ జంగాలు, బుడుబుక్కలోళ్లు, దాసర్లు, బైండ్లవారు, చిందులు, వీరముష్టివారు, బాలసంతులు, పులివేషాలోళ్లు, డప్పులోళ్లు ఇంకా ఎందరో వృత్తిగాయకుల సంప్రదాయ కళలకు తెలంగాణ ఉద్యమ వేదిక మీద ప్రజాదరణ దక్కింది. 'ధూంధాం'లకు జనాదరణ పెరిగింది. ఉద్యమాన్ని కొంతపుంతలు తొక్కించింది. కళాకారులు వివిధ కళారూపాలతో ఆనాటి సాంఘిక జీవనాన్ని కండ్లకు కట్టడంతో జనమంతా 'ఇది కదా! మన తెలంగాణ' అనుకున్నరు. మిద్దె రాములు ఒగ్గుకథ ఎందరినో అలరించింది. డప్పు, గుస్సాడి, కోలాటం ఒకటని కాదు. మొత్తానికి 'మా తెలంగాణ మాగ్గావాలె' ఆలోచనకు తెచ్చిన ఘనత తెలంగాణ ఉద్యమ పాటది. కవులు కళాకారులది. అయితే వేదికలను సమకూర్చిన ఘనత మాత్రం బీఆర్ఎస్ పార్టీది.